# సరస వినోదిని

## పైడిపాటి సుబ్బరామశాస్త్రి



**సత్యం, సాయంత్రం మూడుగంటల వేళ, విజయవాడలో గాంధీనగరంలో ఏదో ఆలోచిస్తూ నడుస్తున్నాడు. హఠాత్తుగా ఒకామె అతనిదారి కడ్డమై నిలచింది.**

"చూశారా— ఎంత పని జరిగిందో," అన్నది ఆమె, అతనితో. సత్యం ఆశ్చర్యపోయాడు. ఆమె ఎవరో అతనికి తెలియదు — ఎక్కడా చూసి నట్లు జ్ఞాపకం లేదు.

జ్ఞాపకం తెచ్చుకోవాలని ప్రయత్నించినా లాభం లేకపోయింది. నిర్విణ్ణుడై నిలబడి పోయాడు.

"మా చెల్లెలు నన్ను ఇంట్లోకి రానీయనే లేదు. తెచ్చిన పిండివంటల బుట్ట వాకిట్లోనే పెట్టి వచ్చేశాను."

"అల్లాగా!" అన్నాడు చెప్పినది వింటు న్నట్లుగా.

"నేను మా వూరు వెళ్ళిపోతున్నాను" అన్నది.

"ఏ ఊరు?"

"తెనాలి"

ఆమె ప్రసంగం ఏదో నవలను ఒక రచ యిత ప్రారంభించినట్లుగా వున్నది. ఆ విచిత్ర వ్యక్తిని గూర్చి ఇంకా తెలుసు కోవాలని సత్యానికి ఆసక్తి కలిగింది. వెనుక నుంచి రిక్షాలు వస్తున్నై. ప్రక్కనున్న కాలి బాట మీదికి రమ్మన్నాడు. ఆమె ఫుట్ పాత్ ఎక్కింది. ఆ ప్రక్కనున్న కొట్లు మూసే వున్నాయి. ఆమె వంకకు పరిశీలనగా చూశాడు. ఆమె వయసు ప్రొద్దు ఇంకా వాలిపోలేదు. చేతిలో ఒక చిన్న సంచీ పట్టు కుంటూ "నీ పేరు నాకు జ్ఞాపకం రావడం లేదు" అన్నాడు. మనిషి నెరిగినట్లుగా.

"సుబ్బి!" అనేసింది, తడుముకోకుండా.

"మీకు పొలం ఏ మాత్రం వుంది?"

"చుండూరులో ముప్పాతిక ఎకరం వుంది."

"మీ ఆయన ఏమిచేస్తూ వుంటాడు?"

"ఏం చేస్తాడు?" అని, మెటికలు విరచి పోస్తూ "త్రాగుతాడు. పైగా, ఒక ముండ కూడా వుంది."

"అయ్యో, పాపం!"

"ఏమి చెప్పను నా సంగతి! నాకు

మంచిరోజులు వస్తాయంటారా? చేయి చూచి చెప్పండి!" అని అరచేయి చాపింది.

"రావచ్చు!" అన్నాడు, సత్యం ఎటూ కాకుండా తనకు సాముద్రికం తెలిసినట్లు.

"ఇంతకీ మీ చెల్లెలు ఏ పేటలో వుంది?" అని ప్రశ్నించాడు.

"సత్యనారాయణపురంలో"

"ఆమె మొగుడు ఏమి చేస్తూవుంటాడు?"

"ఏదో చిన్న ఉద్యోగం! నెలకు వంద రూపాయలు తెస్తాడు."

"చాలుతుందా? పిల్లలెంతమంది?"

"ముగ్గురు! పెద్ద పిల్లకు పన్నెండేళ్ళు. నేనే పెంచుతున్నా. అయితే, ఇప్పుడిక్కడే ఉన్నది లెండి! మా చెల్లెలు నన్ను ఇంట్లోకి రావద్దన్నప్పుడు, మా మరిది ఇంట్లోనే లోపలగా వున్నాడు!" "నీ వయసెంత?" అని. ప్రశ్నించాలని ఊహ వచ్చి ప్రశ్నించాడు.

"ఎంతయితే ఏం! ముప్పై అయిదు ఏళ్ళు. నేనల్లా కనబడడం లేదుగా! పది తక్కువ చెబుతాను. చూచినవాళ్ళు న్యాయంగానే చెప్పాననుకుంటారు. మీకు మాత్రం నిజం చెప్పాను."

తనకు నిజం చెప్పేటంత అభిమానం చూడగానే తనమీద ఎందుకు కలిగిందో సత్యానికి బోధపడలేదు. అయితే ఈ కేసులో ఏదో కిటుకు వున్నట్లుగా మొట్టమొదటి నుంచీ అతనికి అనుమానం. అది వెలికి లాగాలనే ఆసక్తి ఆదినుంచికూడా అతనిలో పెరుగుతోంది. అందుచేత వీలయినంత వరకు సమాచారం సేకరించాడు. తన నెరుగని ఆడది ఎరిగినట్లు మాట్లాడినప్పుడు, నువ్వెవరో నాకు తెలియదు దారి తప్పుకో-అని, గద్దించి వెళ్ళలేక పోయాడు. మొదట విభ్రాంతుడయినా, తర్వాత ఆసక్తి పెరగడంచేత సంభాషణ కొనసాగింది. ఆమెలో వింత ప్రకృతి, సత్యంలో ఆలోచనలు రేకెత్తించడానికి కారణమయింది.

"సత్యనారాయణపురమన్నావు కాదూ! ఏ వీధి?" అన్నాడు, ముఖం అదోలా పెట్టి.

వీధి పేరు చెప్పి ఏ ప్రక్క ఎన్నవ యిల్లోకూడా సుబ్బి గుర్తు చెప్పింది. తాను వీధిలోనే ఉంటున్నట్లు మాత్రం సత్యం చెప్పలేదు.

"ఇంతకీ ఈ విషయాలన్నీ నా కెందుకు చెప్పినట్లు?" అని, సూటిగా చివరిప్రశ్న వేశాడు.

ఆమె తడబడలేదు.

"నేను అయిదు కాసులగొలుసు తాకట్టు పెట్టి, డబ్బంతా మా చెల్లెలికే పెట్టాను. విశ్వాసం లేదు. పైగా పిండివంటలు కూడా తీసుకోను పొమ్మంది. నా గడప త్రొక్క వద్దంది. నా మనస్సులో బాధ నెవరితోనైనా చెప్పుకుంటేనేగాని ఆగదు. అందుచేత చెప్పుకున్నాను. మీరు శాంతంగా విన్నారు. సగం బాధ తగ్గింది."

"పాపం! అల్లాగా!" అంటూ ఆమె ముఖం వంకకు చూశాడు. ముఖంలో ఎక్కడా వేదన కన్పించకపోగా, చిరునవ్వు తాండవిస్తోంది.

"సరే! వెళ్ళి వస్తాను!" అన్నాడు మర్యాదకోసం.

"వెళుతున్నారు సరే కాని, ఇప్పుడు రైలుకు వెళ్ళడానికి నా కొక అర్ధరూపాయి తక్కువవుతుంది. ఇస్తారా?" అన్నది సుబ్బి.

అంతటితో బెడద వదలిపోతుందికదా అని, యాభై పైసల నిచ్చివేశాడు.

* * *

సత్యంలో ఆలోచనలు తిరిగి ప్రారంభించినయ్. అమాయికంగా తన కథ చెప్పుకుందా, అర్ధరూపాయికోసం చెప్పుకుందా, ఇంకా ఏమయినా ఊహతో చెప్పిందా — అనే విషయం తేలలేదు. ఆమెను గూర్చి తెనాలిలో తెలుసుకోవడం కంటె, తన వీధిలో తెలుసుకోవడం సులభమనుకున్నాడు. సుబ్బి తన చెల్లెలి చిరునామా అబద్ధంగా చెప్పి ఉంటే తాను చేయగలిగిందేమీ లేదు.

మఱురోజు ఆమె చెల్లెలిదని చెప్పిన యింటివంక చూస్తూ వెడుతున్నాడు సత్యం. సుబ్బికీ, ఆ గృహిణికీ పోలికలున్నవి. కాబట్టి, కథ కొంత నిజం కావచ్చుననుకున్నాడు. నిత్యమూ ఆమెను చూస్తూనే ఉన్నా సుబ్బి చెల్లెలుగా ఆమెను చూడడం ఇదే ప్రథమం. అయితే ఆమెతో మాట్లాడడం ఎల్లా? ఏమని మాట్లాడాలి?

అది, ఆమె భర్త యింట్లో లేనివేళ—

"ఏమండీ! మీ అక్క సుబ్బమ్మ నిన్న కన్పించింది" అన్నాడు తెగించి, వీధి గుమ్మంలోనుంచి సన్నగా ఆమెకు వినబడేటట్లు.

"సుబ్బమ్మ అనే అక్క నాకు లేదే!" అని ఆమె అంటే—అని, ఆలోచిస్తున్నాడు.

సుబ్బి చెల్లెలు తేరిపార చూచింది.

"లోపలకు రండి. కూర్చోండి!" అన్నది సగౌరవంగా. ఆమెకు కూడా అతని ముఖ పరిచయం వున్నదికదా!

సత్యం కుర్చీలో కూర్చున్నాడు.

"ఎక్కడ కన్పించింది?" అని ప్రశ్న.

"నిన్ననే- రైలుకు వెడుతూ, గాంధీ నగరంలో."

"ఆమె మిమ్మల్ని ఎరుగునా?"

"ఎరుగదు కాని, ఎరిగినట్లు మాట్లాడింది. నిన్న ఆమె పిండివంటలు చేసి తీసికొనివస్తే మీరు నిరాకరించారనీ, గుమ్మంలో పెట్టి వచ్చేశాననీ, అయిదుకాసుల గొలుసు తాకట్టు పెట్టి, ఆ సొమ్ము మీకే పెట్టాననీ, మీకా విశ్వాసం లేదనీ, మీ పెద్దమ్మాయిని కూడా తానే పెంచుతున్నాననీ, తన మొగుడు త్రాగుబోతనీ చెప్పి, రైలుఛార్జీకి తక్కువయిందని ఒక అర్ధ రూపాయి తీసుకుంది."

సుబ్బి చెల్లెలు సత్యం వంక నమ్మకంగా చూసింది.


"ఏమండీ! మనిషికి అయిదు వేళ్ళుంటే అన్నీ సమానంగా ఉంటాయా? అల్లాగే — ఒక తల్లి కడుపున నలుగురు పుడితే, అందరి గుణం ఒక్కటిగా వుండదు.

ఏదయినా సరిపుచ్చుకోవచ్చు కాని, సరిపుచ్చుకోడానికి వీలులేని దొకటి వుంది. అల్లాంటి గుణం కలవాళ్ళతో రాజీ పడడం కష్టం. మా అక్క అంటే చెడుముండ అవుతుందనీ, నా కాపురానికే ఎసరు పెట్టడానికి సిద్ధపడుతుందనీ నేను ఎన్నడూ అనుకోలేదు" అంది గద్గద స్వరంతో.

"మీరు ఆమె పిండివంటలు నిరాకరించిన కారణం అదన్నమాట."

"లేకపోతే- ఒక రక్తం పంచుకుపుట్టిన వాళ్ళు ఒకరిపట్ల ఒకరు అంత కఠినంగా ఉండగలరా?" అన్నది తాపీగా.

సుబ్బి చొరవకు ఆమె దుర్గుణమే కారణమా-అని ఆలోచిస్తున్నాడు.



"పిల్లను పెంచుతానని తీసుకువెళ్ళి దానిని కూడా తన మార్గంలో ప్రవేశపెట్టడానికి ప్రయత్నిస్తే. అది అక్క- ఏమిటి-నేను చెల్లెలినేమిటి? అది నా కూతురు కనుక తిరగబడి లేచి వచ్చేసింది. ఆ మాట మీకెల్లా చెబుతుంది?"

"అల్లాగా !"

"అది తెలిసిన తర్వాత, దాని సంగతి నా కర్థమై, నా మొగుణ్ణి నిగ్గదీశాను. ఆయన నిజం ఒప్పుకున్నారు. దాని సొమ్ము మా ముఖాన పెట్టడానికి కారణం. బంగారం లాంటి నా మొగుడిమీద మక్కువే. నేను కావాలో, అది కావాలో తేల్చుకోమంటే, నా భర్త- ఇకనుంచి నీవు చెప్పినట్లే వింటానన్నారు. ఆయన ఇచ్చిన లోకువ కారణం చేత అప్పుడప్పుడు వస్తూ ఉంటుంది. నాచేత చివాట్లు తిని వెళ్ళిపోతుంది. అది వచ్చినప్పుడు ఆయన లోపలనుంచి బయటకు రాడు"— సత్యం నిట్టూర్చాడు.

"దానికింకా భ్రాంతి పోలేదు. మేము లేమిలో ఉన్నాము కనుక దాని పెండి వంటల కాశపడతామనుకుంది. అది ఎంత చేసు ! దాని సొమ్మెంత చేసు! 'నా గుమ్మం త్రొక్కకు కుక్కా!' అని తిట్టాను. అయినా దానికి బుద్ధిలేదు. అక్కడపడ వేసిపోయింది. నేను దాని నేజంతువుగా తిట్టానో, అవి వాటికే వడవేశాను."

సత్యం తిరిగి నిట్టూర్చాడు.

"ముక్కూ మొగమూ ఎరుగని మీకు చెప్పింతంటే. ఇక అది ఎల్లాంటిదో ఆలోచించుకోండి. నా బావ త్రాగుబోతని అది నాతో చెబితే, తొలినాళ్ళలో నేనూ కాబోలు ననుకున్నాను. దీనిమీద విరక్తిచేత అతడు త్రాగుబోతయినాడని తర్వాత తెలిసింది. తాను సరియైన మనిషననిపించుకోవాలని ఏమేమో చెబుతుంది. మొగుడు ఒకవేళ అలా వుంటే మాత్రం. పెళ్ళాం నీతిగా వుండకూడదని ఏమయినా రూలా?"

సుబ్బి చెల్లెలు వివేకానికి సత్యం ఆశ్చర్యపోయాడు.

"ఏ కట్టైను నిప్పంటే, ఆ కట్టే కాలుతుంది. తాను నిప్పుగా ఎందుకు బ్రతుకకూడదు? తనలో వున్న దోషాన్ని ఇతరుల మీద ఆరోపించడం అసహ్యం! అలా చెప్పేస్థితికి వచ్చిందంటే, మనిషి ఎంత దిగజారిపోయిందో ఆలోచించండి !"

"నిజమే!" అన్నాడు సత్యం.

"అసలు అది మిమ్మల్ని పలుకరించింది ప్రయాను ఛార్జీకి అర్థరూపాయి తక్కువయి కాదు. మగవాళ్ళను ఆలోచన తక్కువ మిమ్మల్ని పలుకరించాలని దాని ఉద్దేశం. దానికి నా సంగతి చెప్పడం ఒక నిమిత్తం."

"అలాగే కన్పిస్తోంది."

"అసలది గబ్బుమనిషి. తన కాపురాన్ని కంపుచేసుకుంది. నా కాపురంలో చిచ్చు కొంతవరకు పెట్టింది. అతికినట్లు మాటలు చెబుతుంది. నన్ను జగడాల మనిషి అని చెబుతుంది."

"అర్థమయింది."

"అర్థమయితే సరేదయయుంచి వెళ్ళండి. ఇక ముందెప్పుడూ దానితో మాట్లాడకండి! మాట్లాడినా, ఆ సంగతులు నాకు వచ్చి చెప్పకండి."

సత్యం తల పంకిస్తూ, వెళ్ళిపోయాడు. ●

శుభసమయమున ఆనంద భరితము చేయు

VIMAL
A RELIANCE PRODUCT

100 పాలిష్టరు సూటింగులు, షర్టింగులు, చీరలు
మరియు డ్రస్ మెటీరియల్సుకై

ఆరాధన, కొత్తగూడెం.

ఇది మీకు చాలా ఉపయోగం

మీకు 'వ్యవహారదర్శిని' అనే తెలుగు పుస్తకం చాలా ఉపయోగం. అందులో ఆస్తి కొన్నా అమ్మినా తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యాపార, పరిశ్రమలకి లాంటి లైసెన్సులు తీసుకోవాలి, అన్నిమతాల వివాహ, విడాకుల నిబంధనలు స్త్రీపురుషుల ఆస్తిహక్కులు, పెద్దవారితో ప్రమాదం రాబోతే పోలీసు రక్షణకు దరఖాస్తు ఎలా వ్రాయాలి, ఇండ్ల స్థలాలకెలా ధరఖాస్తు పంపాలి, లాడ్జింగుల్లో వ్యభిచారనిరోధ రూల్సు, వాటినుంచి రక్షణ వివరాలు, మీరు తెలుసుకోదగిన అనేక చట్టాల వివరాలు, నోట్సు, దస్తావేజులు, ఒప్పందాలు, పిటిషన్లు, ఫిర్యాదులు ఉత్తరాలు ఎలా వ్రాయాలి, వాటి వివిధ నమూనాలు అందున్నాయి. సుమారు 300 పేజీల పుస్తకం. ధర రూ: 12. వి.పి. పోష్టుఖర్చు రూ: 3. అదనం. దేశసేవ ప్రచురణలు, నెం. 2, ఇందిరానగరు, వెంగళరావునగరు టాంకుసమీపాన హైదరాబాదు- 500890కు, మీ ఉపయోగానికి వ్యవహారదర్శిని పుస్తకం ఒకటి వి.పి. పోష్టుద్వారా మీకు పంపించమని నేడే ఉత్తరం వ్రాయండి.

దరఖాస్తులు కోరబడుచున్నవి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వముచే రిజిష్టరు చేయబడినది. ESTD : 1979

ఉద్యోగములు : 1. Clerks 2 Cashiers 3 Accountants 4. Field Man 5. Field Assistant 6. Sub Assistant 7. Sugar Cane Assistant 8. Field Maistry 9 Craft Teachers. విద్యార్హత : 7th Pass to S. S. C., Inter. Degree Pass or Fail

జీతము : రు. 480/-ల నుండి రు. 720/-ల వరకు పొందవచ్చును. పై విద్యార్హతలు గలవారు అగ్రికల్చర్/అకౌంటెన్సీ కోర్సులందు రెగ్యులర్/పోస్టుద్వారా శిక్షణ పొంది శిక్షణానంతరము జరుగు ప్రభుత్వ పరీక్షలందు ఉత్తీర్ణులయినవారు పై ప్రభుత్వోద్యోగములలో నియమింపబడుటకు అర్హులగుదురు. రెగ్యులర్ విద్యార్థులకు భోజన హాస్టలు వసతి కలదు దరఖాస్తు ఫారము, పూర్తి వివరములకు 12 రోజులలోగా రు. 8/-లు M O దిగువ అడ్రసుకు పంపి పొందవచ్చును

**Principal, S. N. A. T. TRAINING INSTITUTE**
**Addanki-523 201 Prakasam District (A.P.)**

వనితాజ్యోతి
(సచిత్ర మాస పత్రిక)

నెల నెలా స్త్రీలకు ఉపయోగకరంగా అందించే బోనస్ పుస్తకాలు వనితాజ్యోతి ప్రత్యేకత—